సాక్షి అనంతపురం

సోమవారం । 28 । అక్టోబర్ । 2024



అయోమయంలో వలంటీర్లు

ఎన్నికల ముందు ఆశపెట్టిన చంద్రబాబు సీఎం అయ్యాక ఊసెత్తకపోవడంతో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. 8లో



టమాట కిలో రూ.30

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.30 పలికింది. కనిష్టం రూ.9, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.7°/20.4°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం దిశగా గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

'వేదవతి'లో కొట్టుకుపోయి వ్యక్తి మృతి



మృతి చెందిన వాల్మీకి వన్నప్ప

కణేకల్లు: మండలంలోని బెణికల్లు–బిదరకుంతం మార్గ మధ్యంలో ప్రవహిస్తున్న వేదవతి హగిరి నదిలో కొట్టుకుపోయి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. బెణికల్లు గ్రామానికి చెందిన వాల్మీకి వన్నప్ప (48) బిదరకుంతం గ్రామంలో తన చిన్నాన్న హనుమంతప్ప పొలంలో పప్పుశనగ విత్తేందుకు శనివారం కాలినడకన బయలుదేరాడు.ముందుగా హనుమంతప్పకు ఫోన్ చేసి వేదవతి హగిరి వద్ద వస్తున్నానని,మరికాసేపట్లో బిదరకుంతం చేరుకుంటానని చెప్పాడు. అయితే ఎంత సేపయినా రాకపోవడంతో హనుమంతప్ప ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. ఆందోళన చెందిన వారు అనుమానంతో వేదవతి హగిరిలో గాలించినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలోనే ఆదివారం ఉదయం నదిలో వన్నప్ప మృతదేహం తేలియాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, బెణికల్లు–బిదరకుంతం మధ్యలో వేదవతి హగిరి నది ప్రవహిస్తోంది. బీటీపీ డ్యాం నిండిన క్రమంలో అధికారులు నీటిని దిగువకు వదులుతుండడంతో ప్రస్తుతం నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బెణికల్లు నుంచి బిదరకుంతం గ్రామానికి కణేకల్లు మీదుగా 18 కిలోమీటర్లు చుట్టేసి వెళ్లాల్సి వస్తోంది. అయితే, ఎలాగోలా హగిరి నదిని రెండు కిలోమీటర్లు దాటితే బిదరకుంతం వెళ్లొచ్చనే ఉద్దేశంతో ప్రమాదమని తెలిసినా కొందరు వరద నీటిలో దిగుతున్నారు. అలా వన్నప్ప కూడా నది దాటుతూ వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కూతుళ్లున్నారు.

నేడు గుంతకల్లులో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం గుంతకల్లులో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు గుంతకల్లు టీటీడీ కల్యాణ మండపంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తనతో పాటు జేసీ, జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

☛ కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో యథావిధిగా 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఉంటుందని, డీఆర్‌ఓ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు

- పెద్దవడుగూరు ఎంపీడీఓ, జీకేఎస్ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు
- పంచాయతీ ఆస్తుల బదలాయింపులో అక్రమాలకు మూల్యం

అనంతపురం సిటీ: విధి నిర్వహణలో నిర్లక్ష్యం.. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో వైఫల్యం.. అక్రమాలు, అవినీతి వెరసి ఇద్దరు అధికారుల పాపం పండేలా చేశాయి. ఒకరు పెద్దవడుగూరు ఎంపీడీఓ ఎస్.బారాన్ సాహెబ్, మరొకరు బుక్కరాయసముద్రం గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శి టి.పెద్ద శ్రీనివాసులు. వీరిద్దరిని సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ వీఆర్ కృష్ణతేజ మైలవరపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని జెడ్పీ సీఈఓ లక్కిరెడ్డిపల్లి వెంకటసుబ్బయ్య ఆదివారం ధ్రువీకరించారు. ఉరవకొండ పంచాయతీ కార్యదర్శులుగా గతంలో ఎస్.బారాన్ సాహెబ్, టి.పెద్ద శ్రీనివాసులు పని చేశారు. ఆ సమయంలో పంచాయతీ ఆస్తి బదలాయింపులో అవకతవకలకు పాల్పడటమే కాకుండా గ్రామ పంచాయతీ ఆస్తుల పరిరక్షణలో ఘోర వైఫల్యం చెందారంటూ గతంలో లోకాయుక్తకు ఫిర్యాదులు అందాయి. దీంతో లోకాయుక్త సమగ్ర విచారణకు ఆదేశించింది. ఆరోపణలన్నీ నిజమేనని తేలడంతో విచారణ అధికారులు నివేదికను లోకాయుక్త సహా పంచాయతీరాజ్ ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం. దీంతో బారాన్ సాహెబ్, టి.పెద్ద శ్రీనివాసులుపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంతో పాటు జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కార్యాలయానికీ ఉత్తర్వులు అందాయి.

సిరుల భూముల్లో చీకట్లు



ఉమ్మడి జిల్లా రైతులకు కరెంటు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం విద్యుత్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. గడిచిన ఐదేళ్లూ సర్కారు భరోసాతో కంటినిండా నిద్రపోయిన అన్నదాతలు చంద్రబాబు సర్కారు అలసత్వం కారణంగా నేడు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. రూ. లక్షలు ఖర్చు పెట్టి బోర్లు వేసుకున్నా ట్రాన్స్‌ఫార్మర్లు లేక బంగారు పంటలు పండించే భూములను బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

రైతులకు అందని ట్రాన్స్‌ఫార్మర్లు

- డబ్బు కట్టి 8 నెలలు దాటినా పంపిణీ చేయని వైనం
- కండెన్సర్లు, వైర్లు కూడా లేక విలవిల
- సిఫార్సుల కోసం ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణ
- 2014–19 కష్టాలు గుర్తుకు తెస్తున్న కూటమి సర్కారు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు లేవు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందన్న సమయంలో ఫిబ్రవరి నుంచి సరఫరా తగ్గింది. ఆ తర్వాత జూన్‌లో కొత్త సర్కారు వచ్చినప్పటి నుంచి ఒక్క ట్రాన్స్‌ఫార్మరూ సరఫరా చేయలేదు. విద్యుత్ అధికారులను అడిగితే రాలేదని చెబుతున్నారు. జనవరిలో డబ్బు కట్టిన వారికి కూడా ఇప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్ అందలేదు. ఇవే కాదు 55 స్క్వేర్ కండక్టర్‌లు, 3 కోర్ కేబుల్, 3 ఫేజ్ 25 కేవీ డీపీలు ఇలా రైతులకు అవసరమైన ఏ కరెంటు పరికరమూ అందుబాటులో లేదు. ఇప్పటికే రైతులు ఖరీఫ్ పంటలు కోల్పోయారు. రబీలోనైనా పంటలు పండించుకుందామని ఆశపడితే ట్రాన్స్‌ఫార్మర్లను చంద్రబాబు ప్రభుత్వం అందించడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సిఫార్సు లెటర్లు పొందితే ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తారనే ఆశతో కూటమి ఎమ్మెల్యేల కార్యాలయాల రైతులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

15 వేల మంది ఎదురుచూపు..

ఒకరు కాదు,ఇద్దరు కాదు 15 వేల మంది రైతులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఎస్పీడీసీఎల్ ఆఫీసులకు కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. 2014–19 సమయంలోనూ ఇదే పరిస్థితిని రైతులు ఎదుర్కొన్నారు. అప్పట్లో ట్రాన్స్‌ఫార్మర్ అందాలంటే కనీసం ఏడాది ఆగాల్సి వచ్చేదంటే ఎంత దుర్భరంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

జగన్ విప్లవాత్మక సంస్కరణలు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్నదాతల కోసం అప్పటి సీఎం జగన్ ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు. డబ్బు కట్టిన మూడు మాసాల్లో ట్రాన్స్‌ఫార్మర్ అందేలా చర్యలు తీసుకున్నారు. డీపీతో పాటు కావాల్సిన పరికరాలు అందించారు. కొత్తగా సబ్‌స్టేషన్లు నిర్మించి నాణ్యమైన కరెంటు అందేలా చూశారు. 2019–24 మధ్యకాలంలో జిల్లాలో రూ.270 కోట్లకు పైగా వ్యయం చేసి 9,612 ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు అందించారు. జిల్లా చరిత్రలో ఇదే ఆల్‌టైమ్ రికార్డు. మొత్తంగా వైఎస్సార్ సీపీ హయాంలో ఉమ్మడి జిల్లాలో 94,060 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి రికార్డు నెలకొల్పగా.. అలాంటి వెలుగుల పరిస్థితి నుంచి మళ్లీ చీకట్లు కమ్ముకుంటున్నాయి. కూటమి సర్కారు పుణ్యమా అని రైతులు కుదేలవుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కోసం తిరుగుతున్నా



ఎన్నికల ముందు ట్రాన్స్‌ఫార్మర్ కోసం డీడీ తీశాను. అప్పటి నుంచి విద్యుత్ శాఖ కార్యాలయానికి తిరుగుతున్నాను. ఇప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదు. సంబంధిత అధికారులను అడిగితే ఇంకా రాలేదంటున్నారు. వస్తే వెంటనే ఇస్తామంటున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– గంగాధర్, రైతు, కుర్లపల్లి, కంబదూరు మండలం

రైతులను చులకనగా చూడటం తగదు



నాది నిరుపేద కుటుంబం. వ్యవసాయమే జీవనాధారం.సొంత పొలంలో బోరు తవ్విస్తే నీరు పడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్ కోసం అప్పుచేసి రూ.19,106 విద్యుత్‌శాఖకు డీడీ తీశాను. నెలలు గడుస్తున్నా మంజూరు చేయలేదు. నిత్యం విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయా. మోటర్, పైపులు కూడా సిద్ధం చేసుకున్నా. ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడిస్తారో మాత్రం అధికారులు చెప్పడం లేదు. రైతుల పట్ల ఇంత చులకన భావం మంచిది కాదు.

– ధర్మానాయక్, ఆవులదట్ల, రాయదుర్గం మండలం

2019-24 మధ్య కాలంలో ఉమ్మడి జిల్లాలో విద్యుత్ సంస్కరణలు ఇలా..

రైతులకు అందించిన ట్రాన్స్‌ఫార్మర్లు	9,612
వ్యయం	రూ.270.82 కోట్లు
ఉచిత వ్యవసాయ కనెక్షన్లు	94,060
నిర్మించిన కొత్త సబ్‌స్టేషన్లు	46
వ్యయం	రూ.161 కోట్లు
33కేవీ కొత్త ఫీడర్లు	11
వ్యయం	రూ.40.26 కోట్లు
11కేవీ ఫీడర్లు	79
వ్యయం	రూ.13.93 కోట్లు
జగనన్న కాలనీల్లో విద్యుత్ కనెక్షన్లు	349
వ్యయం	రూ.88.32 కోట్లు



కారు ప్రమాదంలో ఇద్దరి మృతి



మృతుడు బొజ్జప్ప



మృతి చెందిన నరహరి

హిందూపురం అర్బన్: పుట్టువెంట్రుకల వేడుక జరగాల్సిన ఇంట విషాదం నెలకొంది. సరుకులు కొని తీసుకొస్తుండగా జరిగిన కారు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. పరిగి మండలం కాలువపల్లికి చెందిన బొజ్జప్ప (44), ప్రవీణకుమార్ అన్నదమ్ములు. ఆర్మీలో పని చేస్తున్న ప్రవీణ్‌కుమార్ తన కుమారుడి నామకరణం, పుట్టువెంట్రుకల నిమిత్తం ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. శనివారం బంధుమిత్రుల సమక్షంలో నామకరణం ఘనంగా జరిగింది. ఆదివారం ఉదయం జరిగే పుట్టువెంట్రుకల కార్యక్రమానికి అవసరమైన సరుకులు తీసుకొచ్చేందుకు శనివారం అన్నతో పాటు స్నేహితుడు నరహరి(26) తో కలిసి కారులో హిందూపురం వెళ్లారు. అర్ధరాత్రి తిరుగుపయనమయ్యారు. సరిగ్గా 12.35 గంటల సమయంలో మోతుకపల్లి వద్దకు చేరుకోగానే కారు టైరు పగలడంతో అదుపు తప్పింది. స్టీరింగ్‌పై నియంత్రణ కోల్పోవడంతో కారు సమీపంలోని నాగులకట్ట వద్దగల చెట్టును ఢీకొని తర్వాత ఓ ఇంటిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బొజ్జప్ప, కారు నడుపుతున్న నరహరి అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్‌కుమార్‌కు హిందూపురం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. కారు ఢీకొన్న ఇంటిలో మరొక గదిలో ఇద్దరు నిద్రిస్తున్నా.. వారికి ప్రాణాపాయం తప్పింది. మృతి చెందిన వారిలో బొజ్జప్పకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నరహరికి వివాహం కాలేదు. వన్‌టౌన్ సీఐ శ్రీధర్ కేసు నమోదు చేసి, పోస్టు మార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం బొజ్జప్ప, నరహరి మృతదేహాలను మంత్రి సవిత సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రేపు 'దిశ' సమావేశం

అనంతపురం సిటీ: దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ/పర్యవేక్షణ కమిటీ) సమావేశం స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) లక్కిరెడ్డిపల్లి వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు కమిటీ అధ్యక్షుడు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, నగర పాలక సంస్థ మేయర్ మహమ్మద్ వసీం సలీం, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, దిశ కమిటీ సభ్యులు హాజరవుతారన్నారు. 14 అంశాలపై చర్చ జరుగుతుందని వెల్లడించారు. గత సమావేశాల్లో చర్చించిన అంశాలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమగ్ర సమాచారంతో అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని, గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 'దిశ' సమావేశం తొలిసారి నిర్వహిస్తుండటం గమనార్హం.

రూ. లక్ష కొట్టు.. బెల్ట్ షాపు పెట్టు!



గుమ్మఘట్ట మండలం జె.వెంకటంపల్లిలో ఏర్పాటైన బెల్ట్‌షాపు

గుమ్మఘట్ట: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామీణ ప్రాంతాల్లో మద్యం ఏరులై పారుతోంది. మద్యం దుకాణాలు దక్కించుకున్న వారితో టీడీపీ నాయకులు కుమ్మక్కై గ్రామాల్లో బెల్ట్ షాపులకు తెరతీశారు. ఇందుకు ఒక్కో బెల్ట్ షాపు నుంచి రూ. లక్ష చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిసింది. టీడీపీ నాయకులకు సొమ్ము ముట్టజెప్పి గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకెర, జె.వెంకటంపల్లి, గోనబావి గ్రామాల్లో కొందరు బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారు. మద్యానికి డిమాండ్ అధికంగా ఉన్న కొన్ని గ్రామాల్లో రెండు, మూడు దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఈ క్రమంలో క్వార్టర్‌కు రూ. 10 నుంచి రూ. 20 వరకు అధికంగా బెల్ట్‌షాపు నిర్వాహకులు వసూలు చేస్తున్నారని మందుబాబులు చెబుతున్నారు. దేవుళ్లను అడ్డం పెట్టుకుని, అభివృద్ధి పేరుతో 'తమ్ముళ్లు' డబ్బు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. బెల్టు షాపుల ఏర్పాటుతో పచ్చని పల్లెల్లో వివాదాలు రాజుకుంటున్నాయి. పేద, బడుగు బలహీన వర్గాల కుటుంబాల బతుకులు ఛిద్రమవుతున్నాయి. ఈ విషయాలన్నీ అర్థం చేసుకున్నారు కనుకనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బెల్ట్‌షాపులు లేకుండా చర్యలు తీసుకున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఆదాయమే పరమావధిగా మద్యం విచ్చలవిడి అమ్మకాలకు తెర లేపడంపై మండిపడుతున్నారు. ఎక్సైజ్, సివిల్ పోలీసులు బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

అందరి సహకారంతో విద్యాభివృద్ధి

- నూతన డీఈఓగా బాధ్యతలు తీసుకున్న ప్రసాద్‌బాబు



డీఈఓ ప్రసాద్‌బాబును కలిసిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ఏడీలు, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలు, డీఈఓ, సమగ్ర శిక్ష కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజా సంఘాల సహకారంతో జిల్లాలో విద్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసేందుకు కృషి చేస్తానని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) ఎం.ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఈయనను ఇటీవల ప్రభుత్వం జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. డీఈఓ, సమగ్రశిక్ష కార్యాలయాల ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తరలివచ్చి బొకేలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన డీఈఓ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరిస్థాయిలో వారు పనులను బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలన్నారు. ఏ ఒక్కరూ ఇబ్బందులు పడాల్సిన పనిలేదని, ఏ సమస్య ఉన్నా తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. కాగా.. సోమవారం విజయవాడలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ కొత్త డీఈఓలతో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం డీఈఓ ప్రసాద్‌బాబు ఆదివారం బయలుదేరి వెళ్లారు. మంగళవారం అందుబాటులో ఉండనున్నారు.

సిమ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

అనంతపురం ఎడ్యుకేషన్: సైన్స్ ఇన్నోవేషన్ మారథాన్ (సిమ్)లో ప్రతి పాఠశాల సోమవారం సాయంత్రం లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకోవాలన్నారు. సైన్స్, గణితం ఉపాధ్యాయులు ముగ్గురు విద్యార్థులతో కనీసం మూడు టీమ్‌లను https://schoolinnovationmarathon. org వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేయాలని ఆదేశించారు. రిజిస్టర్ అయిన పాఠశాలలకు 'సిమ్' ప్రతినిధులు శిక్షణ ఇస్తారని వెల్లడించారు. శాస్త్రీయ విధానంలో నూతనంగా ఆలోచించాలి, సమస్యలకు వినూత్నమైన, సులభతరమైన పరిష్కారాలు ఎలా అన్వేషించాలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులతో ప్రాజెక్టులు తయారు చేయిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈఓతో పాటు సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు, జిల్లా సైన్స్ అధికారి బాల మురళీకృష్ణ కోరారు.

జీవాల ఖిల్లా.. ఉమ్మడి జిల్లా!

- త్వరలో పశుగణనకు కసరత్తు
- పశుసంపదలో ఇప్పటికే రాష్ట్రంలోనే ముందువరుసలో ఉమ్మడి జిల్లా
- ఇక్కడి చిట్టడవులే పశు వృద్ధికి మూల కారణం
- జింకలు, చిరుతల సంఖ్యలో కూడా గణనీయంగా పెరుగుదల
- జీవాల పెంపకంపై ఆధారపడి వేలాది కుటుంబాల జీవనం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రా (ఫలాలకు నిలయం)గా చెప్పుకునే ఉమ్మడి అనంతపురం జిల్లా పశు సంపదకూ అడ్డాగా నిలిచింది. 90 శాతం మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న ఉమ్మడి జిల్లాలో పశువులకూ అంతే ప్రాధాన్యం ఉంది. ఇప్పటికే రాష్ట్రంలో పశు సంపదలో మొదటిస్థానంలో ఉన్నట్టు అంచనా. తాజాగా పశు గణన చేపడుతుండటంతో ఈ స్థానాన్ని నిలబెట్టుకోగలదని ఆశిస్తున్నారు. త్వరలో ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో పశువులను లెక్కించనున్నారు. జిల్లాలో ఏ కేటగిరీ పశువులు ఎన్ని ఉన్నాయో తేలనుంది.

పొట్టేళ్లు, మేకలే జీవనాధారం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పొట్టేళ్లు, మేకల సంఖ్య అనూహ్యంగా పెరుగుతున్నట్టు తాజా అధ్యయనంలో తేలింది. ఉమ్మడి జిల్లాలోని పట్టణాలతో పాటు సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటకకు కూడా మాంసం కోసం అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచే జీవాలు ఎగుమతి అవుతాయి. వేలాది కుటుంబాలు పొట్టేళ్లు, గొర్రెలు, మేకల పెంపకంతో జీవనోపాధి పొందుతున్నాయి. మరో వైపు మాంసం అమ్మకాల ద్వారా లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది.

అడవులే పెట్టని కోటలు..

ఉమ్మడి జిల్లాలో పెద్ద పెద్ద అడవులు లేకపోవచ్చు కానీ ఇక్కడి చిట్టడవులు పశు సంపద వృద్ధికి ఇతోధికంగా దోహదం చేస్తున్నాయి. దేశీయంగా పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు సైతం ఈ జిల్లాలో ఉన్న గ్రాసం వనరులను పరిశీలించారు. ఇక్కడ మేలి రకం గ్రాసం దొరుకుతున్నట్టు తేల్చారు. 2.25 లక్షల హెక్టార్లలో చిట్టడవులు వ్యాపించి ఉండటంతో లక్షలాది జీవాలు గ్రాసంతో వృద్ధి చెందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది మాంసం, పాల ఉత్పత్తుల కోసం జీవాలను పెంచుకుంటున్నారు.

వన్యప్రాణులకూ నిలయం..

వేలాది కుటుంబాలతో మమేకమై ఉన్న పశువులకే కాదు వన్యప్రాణులకూ ఉమ్మడి అనంతపురం జిల్లా నిలయంగా ఉంది. చాలా జిల్లాల్లో జింకలు, చిరుతలు అంతరించి పోతుండగా ఉమ్మడి జిల్లాలో మాత్రం అనూహ్యంగా వృద్ధి చెందుతుండటం గమనార్హం. వేలాది జింకలకు ఈ చిట్టడవులు శాశ్వత స్థావరంగా ఉన్నాయి. ఇక చిరుతల వృద్ధి అంతా ఇంతా కాదు. నెమళ్లు, కుందేళ్లు, ఎలుగుబంట్లు వంటివన్నీ ఇక్కడి చిట్టడవుల్లో సురక్షితంగా ఉన్నట్టు ఫారెస్టు అధికారులు చెబుతున్నారు. రమారమి రెండు జిల్లాల్లో 3 వేల వరకూ జింకలు ఉన్నట్టు ప్రాథమిక అంచనా. 200 వరకూ చిరుతలు ఉన్నట్టు తెలుస్తోంది.

జిల్లాలో 2023 అంచనాల ప్రకారం పశు సంపద ఇలా

కేటగిరీ	సంఖ్య
గేదెలు	2,42,801
ఆవులు	2,94,563
గొర్రెలు	26,88,731
మేకలు	6,14,390
పందులు	10,171
కోళ్లు	13,67,019

శ్రీ సత్యసాయి జిల్లాలో..

కేటగిరీ	సంఖ్య (అంచనా)
గేదెలు	1,48,114
ఆవులు	3,67,394
గొర్రెలు	28,51,268
మేకలు	5,78,002
పందులు	5,901
కోళ్లు	16,28,773

అనధికార టపాసుల విక్రయదారులపై కఠిన చర్యలు


తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం: జిల్లాలో అనధికారికంగా టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని ఎస్పీ జి.జగదీష్ హెచ్చరించారు. బాణాసంచా విక్రయ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే టపాసులు విక్రయించాలన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీపావళి సందర్భంగా జిల్లాలో టపాసుల అక్రమ విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టామన్నారు. లైసెన్స్ కలిగిన దుకాణదారులు పాటించాల్సిన నియమ, నిబంధనలను వెల్లడించారు. దీపావళి సందర్భంగా అవాంఛనీయ ప్రమాదాలు చోటు చేసుకుంటే వెంటనే డయల్ 100, 112కు సమాచారం అందించాలని కోరారు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి


వరలక్ష్మి (ఫైల్)

విడపనకల్లు: విద్యుత్ షాక్‌కు గురై ఓ మహిళా రైతు మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన బసాపురం వరలక్ష్మి (36), పెన్నయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. తమకున్న ఐదు ఎకరాల్లో మిరప పంట సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన వరలక్ష్మి బోరు మోటార్ స్విచ్ ఆన్ చేసేందుకు స్టార్టర్ స్విచ్ తాకగానే షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనపై విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అయోమయంలో వలంటీర్లు!

- అధికారంలోకి వస్తే రూ.10 వేల వేతనం అన్నారు
- జిల్లాలో రోడ్డున పడిన 10,340 మంది వలంటీర్లు
- కూటమి సర్కార్ తీరు మార్చుకోకపోతే ఉద్యమ బాట పడతామంటూ హెచ్చరిక

నియోజకవర్గాల వారీగా వలంటీర్ల వివరాలు

నియోజకవర్గం	వలంటీర్లు
రాయదుర్గం	1,499
కళ్యాణదుర్గం	1,355
ఉరవకొండ	1,450
గుంతకల్లు	1,460
తాడిపత్రి	1,550
అనంతపురం	1,510
శింగనమల	1,480
మొత్తం	10,304


పక్షవాతంతో బాధపడుతున్న వ్యక్తికి పింఛన్ ఇస్తున్న మహిళా వలంటీర్ (ఫైల్)

రాయదుర్గం: గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పని చేస్తూ విశిష్ట సేవలందించిన వలంటీర్ వ్యవస్థ చంద్రబాబు పాలనలో కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు దాటినా... వలంటీర్ వ్యవస్థను సీఎం చంద్రబాబు స్తబ్దుగా ఉంచడమే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో తమను కొనసాగిస్తారా? లేక రోడ్డు పాలు చేస్తారా? అనే అయోమయంలో వలంటీర్లు కొట్టుమిట్టాడుతున్నారు.

రూ.10 వేలు గౌరవ వేతనం అన్నారు

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ ప్రతి 50 కుటుంబాలకు ఓ వలంటీర్ చొప్పున గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మొత్తం 10,340 మందిని రిజర్వేషన్ల ప్రాతిపదికన నియమించారు. ఇందులో 50 శాతానికి తగ్గకుండా మహిళలకు ఉపాధి అవకాశం దక్కింది. వీరి సేవలకు గౌరవ వేతనంగా అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి నెలా రూ.5 వేలు చొప్పున చెల్లిస్తూ వచ్చారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ప్రతి వలంటీర్‌కు ప్రతి నెలా రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లిస్తామంటూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ హామీనిచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత వలంటీర్లను దూరం పెడుతూ వచ్చారు. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ వేతనాలు అందలేదు. పైగా నేటికీ వలంటీర్ వ్యవస్థపై ఎక్కడేగాని సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కళ్యాణ్ స్పష్టమైన భరోసాని వ్వలేకపోతున్నారు.

సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వలంటీర్లను పూర్తిగా పక్కన పెట్టి వారి బాధ్యతలను సచివాలయ ఉద్యోగులకు కట్టబెట్టారు. గడిచిన ఐదేళ్ల పాటు ఠంచనుగా ఒకటో తేదీ తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇళ్ల తలుపులు తట్టి సామాజిక భద్రత పింఛన్ అందజేయడంలోను, కరోనా సమయంలో ప్రజలకు నాణ్యమైన వైద్య, ఇతర సేవలను అందించడంలోనూ వలంటీర్ల తీసుకున్న చొరవ ఎనలేనిది. ప్రజలకు అందజేసే ప్రతి ప్రభుత్వ కార్యక్రమాల్లో వలంటీర్లు అప్పట్లో కీలకంగా మారారు. జగన్ సర్కార్ అమలులోకి తెచ్చిన 33 రకాల ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించారు. ఇంతటి గొప్ప వ్యవస్థకు శ్రీకారం చుట్టిన వైఎస్ జగన్‌కు అప్పట్లో దేశ వ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఈ విధానం అమలు చేసేందుకు చాలా రాష్ట్ర ప్రభుత్వాలూ అధ్యయనం చేశాయి. ప్రస్తుతం వలంటీర్లను పక్కన పెట్టి ఐదు నెలలుగా వారిని అయోమయానికి గురి చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఉద్యోగ భద్రత కోరుతూ రాష్ట్రంలో ఇప్పటికే పలు చోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినా ప్రభుత్వ తీరులో మార్పు రాకపోవడంతో పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వలంటీర్ల సంఘం నేతలు వెల్లడించారు.

ఎంతో నిబద్ధతతో పని చేశాం



వలంటీర్‌గా ఎంతో నిబద్ధతతో ఐదేళ్ల పాటు పని చేశా. నిరుద్యోగిగా ఉండే నాకు ఉన్న ఊర్లోనే చిరుద్యోగం దక్కిందనుకున్నా. అవినీతికి ఆస్కారం లేకుండా విశిష్ట సేవలు అందించాం. మా సేవలను సీఎం చంద్రబాబు గుర్తించి వలంటీర్ వ్యవస్థను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి.
– వాల్మీకి తిప్పేస్వామి, వలంటీర్, సిరిగేదొడ్డి, గుమ్మఘట్ట మండలం

సరైన నిర్ణయం తీసుకోవాలి



కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలవుతున్నా వలంటీర్ వ్యవస్థపై సరైన నిర్ణయం వెల్లడించలేదు. మాకు ఎలాంటి విధులు, బాధ్యతలు అప్పగించలేదు. రూ.5 వేల నుంచి రూ.10 వేలకు వేతనం పెంచుతామన్నారు. అయితే ఇప్పటికీ ఒక్క నయాపైసా గౌరవ వేతనం కూడా చెల్లించలేదు. వలంటీర్ వ్యవస్థపై సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశతో ఎదురుచూస్తున్నాం.
– మంజునాథ నాయక్, ఆర్‌బీ వంక తండా, రాయదుర్గం

ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు భారం

- ఎన్నికల హామీని తుంగలో తొక్కిన చంద్రబాబు
- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి


వజ్రకరూరు: నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఏమాత్రం పట్టించుకోని కూటమి ప్రభుత్వం తాజాగా ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు భారం మోపేందుకు సిద్ధమైందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మండిపడ్డారు. విద్యుత్ చార్జీలు పెంచబోమంటూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో సీఎం చంద్రబాబు విఫలమయ్యారన్నారు. ఆదివారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ వినియోగంపై ట్రూ అప్ చార్జీల పేరుతో యూనిట్‌కు రూ.1.58 చొప్పున ప్రజలపై ఏకంగా రూ.6,072 కోట్ల భారం మోపడం సరికాదన్నారు. బాబు నయవంచక పాలనకు ఇది నిదర్శనమన్నారు. హామీలపై ప్రజలు నిలదీయకుండా ఉండేలా డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర తీస్తున్నారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపునకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కారణమంటూ కొత్త డ్రామాకు తెరలేపడం సిగ్గు చేటన్నారు. దీంతోపాటు కరెంట్ వాడకపోయినా కనీస చార్జీ కింద రూ.50 వసూలు చేసే సంప్రదాయానికీ తెరతీయడం దారుణమన్నారు. విద్యుత్ బిల్లులో శ్లాబ్‌ల విధాన సృష్టికర్త కూడా చంద్రబాబేనని గుర్తు చేశారు. ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం మంగళం పాడి రైతులకు తీరని వేదన మిగిల్చిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన పెట్టుబడి సాయం ఇప్పటి వరకూ రైతులకు అందలేదన్నారు. ఉచిత పంటల బీమాను పారదర్శకంగా అమలు చేయడంతో పాటు ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే ఆ సీజన్ ముగిసేలోపు పరిహారాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసిందని గుర్తు చేశారు. నవంబర్ నుంచి ఏకంగా 15 నెలల పాటు ట్రూ అప్ చార్జీల పేరుతో భారం మోపాలన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా


మృతుడు కళ్యాణ్‌రామ్

రాయదుర్గం టౌన్: ఈత సరదా ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. వివరాలు... రాయదుర్గంలోని బీటీపీ హౌసింగ్ లే అవుట్‌లో నివాసముంటున్న నాయకుల హరి, వరలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. రెండో కుమారుడు కళ్యాణ్‌రామ్ (22) తన తండ్రితో కలసి బేల్దారి పనులకు వెళుతూ కుటుంబానికి చేదోడుగా ఉంటూ వచ్చాడు. ఇటీవల కురిసిన వర్షాలకు బీటీపీ లే అవుట్ సమీపంలోని లోతైన గుంతల్లో భారీగా నీరు చేరుకుంది. దీంతో ఆదివారం తన స్నేహితులతో కలసి ఈత కొట్టేందుకు ఆ గుంతల వద్దకు కళ్యాణ్‌రామ్ వెళ్లాడు. అయితే ఈత రాని కళ్యాణ్‌రామ్... లోతైన ప్రాంతంతో దూకడంతో బురదలో కూరుకుపోయాడు. ఎంత సేపటికీ ఆయన బయటకు రాకపోవడంతో భయపడిన స్నేహితుల నుంచి సమాచారం అందుకున్న బంధువులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టి, కళ్యాణ్‌రామ్‌ను వెలికి ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


'అ'పూర్వ' కలయిక



యాడికి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1990–91లో పదో తరగతి చదువుకున్న వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలిశారు. అమెరికా, బెంగళూరు, హైదరాబాద్, కర్నూలు, తిరుపతి, అనంతపురం తదితర ప్రాంతాల్లో ఇంజినీర్లుగా, తహసీల్దార్లుగా, ఉపాధ్యాయులుగా, వ్యాపారులుగా స్థిరపడిన వారందరూ దాదాపు 33 సంవత్సరాల తర్వాత కలవడంతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. పాఠశాల ఆవరణమంతా కలియ దిరిగి, చిన్ననాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. నాటి గురువులు విజయభాస్కర్ రెడ్డి, అశ్వత్థ రెడ్డి, కుళ్లాయి రెడ్డి, వెంకటరమణ, జనార్దన, నారాయణ స్వామి, క్లర్క్ ఈశ్వరప్ప, ప్రస్తుత హెచ్‌ఎం నాగన్నను ఘనంగా సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో తాము భాగస్వాములవుతామని పూర్వ విద్యార్థి శేషారెడ్డి (ప్రస్తుత పుట్లూరు మండల తహసీల్దార్) పేర్కొన్నారు. పూర్వ విద్యార్థులు ఆదిత్య పవన్, నూర్‌బాషా, రాయుడు, శ్రీనివాసులు, శర్మాస్‌వలి, విజయలక్ష్మి, హేమలత, చైతన్య, శోభారాణి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

- 30 గొర్రెల మృతి


మృతి చెందిన గొర్రెలు

ఉరవకొండ: స్థానిక 42వ జాతీయ రహదారిపై అనంతపురానికి వెళ్లే మలుపు వద్ద ఆదివారం ఉదయం లారీ దూసుకెళ్లిన ఘటనలో 30 గొర్రెలు మృతి చెందాయి. మరో 25 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. కర్ణాటకలోని హగిరికి చెందిన ఆరుగురు గొర్రెల కాపరులు తమ గొర్రెలను వారి స్వగ్రామానికి కాలినడకన తీసుకెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అనంతపురం నుంచి బళ్లారికి వెళుతున్న లారీ తెల్లవారుజామున రోడ్డు దాటుతున్న గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. అతి వేగమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. గాయపడిన గొర్రెలకు ఉరవకొండ పశువైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య సంఘటనా స్థలంలో చికిత్స అందించారు. ఉరవకొండ అర్బన్ సీఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు


నివాళులర్పిస్తున్న అనంతపురం మేయర్ వసీం

అనంతపురం/కల్చరల్/మెడికల్: 'మిత్రులారా ఓ దివ్య ఆశయాన్ని నెరవేర్చడానికి ధర్మ ప్రచార బాధ్యతను తీసుకున్నాం. ఆ శ్రీకృష్ణపరమాత్మ మిమ్మల్ని తనలో విలీనం చేసుకుని మరేదో సందేశాన్ని పంపించాడు. మీ ఆశయాలను పాటించడమే లక్ష్యంగా ముందుకెళ్తాం. మీ పవిత్ర ఆత్మలకు శాంతి కల్గిస్తాం' అంటూ రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందిన శ్రీకృష్ణ భక్తులకు ఇస్కాన్ పద్ధతుల్లో ఆ సంస్థ ప్రతినిధులు నివాళులర్పించారు. అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. అంతకు ముందు జీజీహెచ్‌లోని మార్చురీలో ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ డాక్టర్ శంకర్ నాయక్ నేతృత్వంలో వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వినీల్‌రాజు, డాక్టర్ రమేష్‌బాబు పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబీకులకు అప్పగించారు. శ్రీధర్ ప్రభు, వెంకటేష్, ప్రణవ్‌సాయిరెడ్డి మృతదేహాలను ఇస్కాన్ మందిరం వద్దకు చేర్చిన అనంతరం వారి ఆత్మశాంతి కోసం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. శోకసంద్రమైన ఆ వాతావరణంలో మరణించిన వారి కుటుంబ సభ్యుల విషన్న వదనాలు చూపరులను కంటతడి పెట్టించాయి. శ్రీకృష్ణప్రభువు సన్నిధికి చేరుకున్న తమ బిడ్డల అవయవాలను దానం చేసి మరి కొందరి జీవితాలను ఆధ్యాత్మికం వైపు నడిపించాలని కోరుకున్న ఆ తల్లిదండ్రులను చూసి పలువురు ఆశ్చర్యపోయారు. అనంతరం ప్రత్యేక పూలతో అలంకరించిన వైకుంఠ రథాలపై ఊరేగింపు గుత్తి రోడ్డులోని హరిశ్చంద్రఘాట్‌కు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. అంతకు ముందు శ్రీకాకుళం నుంచి వచ్చిన తల్లిదండ్రులు షణ్ముఖ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. అంత్యక్రియల అనంతరం వారిని ఇస్కాన్ మందిరం నుంచి ప్రత్యేక వాహనంలో వారి స్వగ్రామానికి వెళ్లే ఏర్పాటు చేశారు.

ధర్మ ప్రచారకులను కోల్పోయవడం బాధాకరం

రోడ్డు ప్రమాదంలో ఇంత మంది ధర్మ ప్రచారకులను కోల్పోవడం బాధాకరమని అనంతపురం నగర మేయర్ వసీం ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్కాన్ మందిర ప్రాంగణంలో భక్తుల సందర్శనార్థం ఏర్పాటు చేసిన పార్థివదేహాలను ఆయన సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. గొప్ప వ్యక్తిత్వ నిర్మాణం చేసుకున్న సేవకుల ఆశయాలను పాటిద్దామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ మేయర్ స్వరూప, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, కార్పొరేటర్ కమలభూషణ్, నాగార్జున రెడ్డి, బీజేపీ నాయకుడు చార్లెస్ చిరంజీవిరెడ్డి కూడా మృతులకు శ్రద్ధాంజలి ఘటించారు.

'శ్రీగంధం' అపహరణ కేసులో నిందితుల అరెస్ట్

- ఈ నెల 21న అర్ధరాత్రి కోర్టు ఆవరణలో కోతకు గురైన శ్రీగంధం చెట్లు


స్వాధీనం చేసుకున్న శ్రీగంధం దుంగలను చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలోని రెండు శ్రీగంధం చెట్లు కోసి ఓ చెట్టు దుంగలను అపహరించిన కేసులో ముగ్గురు నిందితులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అర్బన్ పీఎస్‌లో సీఐ జయనాయక్ వెల్లడించారు. కోర్టు ఆవరణలో 20 ఏళ్లుగా పెంచుతున్న రెండు శ్రీగంధం చెట్లను ఈ నెల 21న అర్ధరాత్రి దుండగులు కోసి వేశారు. ఇందులో ఓ చెట్టును సగం కోసి అక్కడే వదిలేశారు. మరో చెట్టు దుంగలను అపహరించుకు వెళ్లారు. ఘటనపై ఈ నెల 22న కోర్టు సబార్డినేటర్ ఎం.రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా విడిపోయి పక్కా ఆధారాలతో రాయదుర్గంలోని మొలకాల్మూరు రోడ్డులో నివాసముంటున్న బెస్త రాజు, బెస్త సిద్దప్ప, వడ్డే సుంకన్నను ఆదివారం బీటీపీ లే అవుట్ వద్ద అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం తెలిసింది. దీంతో నిందితుల నుంచి 20 కిలోల బరువున్న శ్రీ గంధం చెక్కలు, ఓ రంపం, ద్విచక్ర వాహనం సీజ్ చేశారు. నిందితులు గతంలోనూ చుట్టుపక్కల ఇలాంటి చోరీలకే పాల్పడినట్లు ఎస్‌ఐ బాలరాజు వివరించారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు పేర్కొన్నారు.

గొర్రెల దొంగల అరెస్ట్

బత్తలపల్లి: గొర్రెల అపహరణ కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ వెల్లడించారు. జీవాల పోషణతో జీవనం సాగిస్తున్న బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామానికి చెందిన కుంటాల రామచంద్రకు చెందిన ఓ గొర్రెను శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ముగ్గురు యువకులు అపహరించుకెళ్లారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... దుండగులు వినియోగించిన ద్విచక్ర వాహనం నంబర్ ఆధారంగా దుండగులను నార్పలకు చెందిన తొట్టి అమర్, ఆకుల ప్రసన్న, రాగే యశ్వంత్‌గా గుర్తించి, అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.8,500 విలువ చేసే గొర్రెతో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన ఎస్‌ఐ సోమశేఖర్, కానిస్టేబుళ్లు సుదర్శన్‌నాయుడు, అనిల్‌కుమార్‌ను సీఐ ప్రభాకర్ అభినందించారు.

30 శాతం ఐఆర్ మంజూరు చేయాలి : పీఆర్టీయూ


మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గిరిప్రసాద్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ వేతన సవరణ రిపోర్ట్ (పీఆర్సీ) వచ్చే లోపు 30 శాతం ఇంటీరియం రిలీఫ్ (ఐఆర్) మంజూరు చేయాలని ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎం గిరిప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం పర్యటనకు వచ్చిన స్థానిక పీఆర్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ ఆలస్యమవుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు తాత్కాలిక భృతి వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా డీఏ, ఇతర పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ప్రధానకార్యదర్శి జి.తిమ్మారెడ్డి, రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగ సంఘం కన్వీనర్ గుజ్జల తిరుపాల్, ఎంవీ శివారెడ్డి, కె.యల్లప్ప, పి.నాయకుడు, ఎల్. కేశవనాయుడు, కె.సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ఓవరాల్ చాంపియన్ 'అనంత'

- హోరాహోరీగా సాగిన పోటీలు
- జాతీయ స్థాయి పోటీలకు పలువురి ఎంపిక



విజేత ట్రోఫీలను అందుకుంటున్న అనంతపురం బాలికల జట్టు, బాలుర జట్టు

హిందూపురం టౌన్: స్థానిక ఎంజీఎం క్రీడామైదానం వేదిగా మూడు రోజుల పాటు సాగిన రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాల, బాలికల ఫుట్‌బాల్ టోర్నీ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను అనంతపురం బాల, బాలికల జట్లు దక్కించుకున్నాయి. బాలికల విభాగంలో ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో తూర్పు గోదావరి జట్టుపై 4-0 గోల్స్ తేడాతో అనంతపురం జట్టు గెలుపొందింది. రెండో స్థానంలో తూర్పు గోదావరి, మూడో స్థానంలో చిత్తూరు, నాల్గో స్థానంలో పశ్చిమ గోదావరి జట్లు నిలిచాయి. అలాగే బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్టుతో తలపడిన 4-0 తేడాతో తేడాతో అనంతపురం జట్టు గెలుపొందింది. రెండో స్థానంలో శ్రీకాకుళం, మూడో స్థానంలో విశాఖపట్నం, నాల్గో స్థానంలో చిత్తూరు జట్లు నిలిచాయి. విజేత జట్లను అభినందిస్తూ ట్రోఫీలను ప్రదానం చేశారు. టోర్నీలో ప్రతిభ చూపిన క్రీడాకారులను నవంబర్‌లో మహారాష్ట్రలోని నాందేడ్ వేదికగా జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలికల జట్టులో అనంతపురం జిల్లాకు చెందిన తనుశ్రీ, లాస్య, గగనశ్రీ, వర్ష, మంజుల, తూర్పు గోదావరికి చెందిన మేఘన, భవ్యశ్రీ, కృష్ణ యశస్వి, చిత్తూరుకు చెందిన నషిత, రెడ్డి ప్రసన్న, పూజ, పశ్చిమ గోదావరి నుంచి పి.ప్రవళిక, పి.అశ్రిత, గుంటూరు నుంచి శ్రీవల్లి, టి.ప్రవళిక, పావని (నెల్లూరు), యుస్కన్ (కర్నూలు), అక్షయ్య (కృష్ణ) చోటు దక్కించుకున్నారు. అలాగే బాలుర జట్టుకు అనంతపురం జిల్లా జట్టుకు చెందిన శేఖర్, వీక్షిత్, సాయితరుణ్ గౌడ్, వేణుకుమార్, సిద్దార్థ్, శ్రీకాకుళానికి చెందిన సుందర్ జోష్, కిరణ్, గౌతమ్ సాయి, విశాఖకు చెందిన దన్‌జూన్, భరత్, రాహుల్, చిత్తూరు జట్టు నుంచి పునీత్ కుమార్, నితీష్, విక్రాంత్‌తో పాటు ప్రజ్వల్ (వైఎస్సార్), జేబీ సూర్య (తూర్పు గోదావరి), శౌర్య (నెల్లూరు), భార్గవ్ (కృష్ణ), స్టాండ్ బై గా లోకేష్ (అనంతపురం), చిరంజీవి (గుంటూరు) ఎంపికయ్యారు. కార్యక్రమంలో టోర్నీ అబ్జర్వర్ అనిల్ నాయక్, ఎంఈఓ గంగప్ప, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ మొరార్జీ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లోకనాథ్, కౌన్సిలర్లు రమేష్, సతీష్, అయూబ్, ప్రధానోపాధ్యాయులు సామ్రాజ్యం, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివకుమార్, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర నాయకులు సురేష్ కుమార్, కోశాధికారి రామకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

కనగానపల్లి: మండల పరిధిలోని తగరకుంట గ్రామంలో ఆదివారం 20 ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుబడినట్లు ఎస్‌ఐ ఇషాక్ బాషా తెలిపారు. ఆదివారం సాయంత్రం గ్రామంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కర్ణాటక మద్యం ప్యాకెట్లను అక్రమంగా విక్రయిస్తున్న డి.పెదకుళ్లాయప్ప అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 20 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

ముగిసిన అంతర్ కళాశాలల క్రీడా పోటీలు



ఎస్ఎస్‌బీఎన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ డా.బి.జెస్సీ

అనంతపురం సిటీ: ఎస్కేయూ అంతర్ కళాశాలల గ్రూప్–ఏ క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. రెండ్రోజుల పాటు హోరాహోరీగా సాగిన వివిధ రకాల్లో విజేత జట్లను అభినందిస్తూ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆశావాది శశాంక మౌళి, ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ డా.బి.జెస్సీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.శ్రీరామ్, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు. చెస్ పోటీల్లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల జట్టు విజేతగా నిలవగా ఎస్కేయూ విద్యార్థి రన్నరప్‌ను దక్కించుకున్నాడు. సాఫ్ట్‌బాల్ విజేతగా ఆర్ట్స్ కళాశాల, రన్నరప్‌ను ఎస్ఎస్‌బీఎన్ కళాశాల దక్కించుకున్నాయి. వాలీబాల్‌లో ఎస్ఎస్‌బీఎన్ కళాశాల జట్టు విజేతగా నిలిచింది. ఆర్ట్స్ కళాశాల జట్టు రన్నరప్‌ను కైవశం చేసుకుంది. బాల్‌బ్యాడ్మింటన్‌లో గుంతకల్లులోని ఎస్ఎస్‌జీఎస్ కళాశాల విజేతగా నిలిచింది. రన్నరప్‌ను ఆర్ట్స్ కళాశాల దక్కించుకుంది. టేబుల్ టెన్నిస్‌లో కదిరిలోని ఎస్‌టీఎస్ఎన్ డిగ్రీ కళాశాల విజేతగా నిలవగా, రన్నరప్‌ను ఎస్ఎస్‌బీఎన్ కళాశాల దక్కించుకుంది.

నేడు పాండురంగడి నిజపాద దర్శనం

అనంతపురం కల్చరల్: నగరంలోని రామనగర్‌లో వెలసిన శ్రీరుక్మిణి పాండురంగ స్వామి ఆలయంలో సోమవారం రమా ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు బావసార క్షత్రియ సమాజ్ నిర్వాహకుడు ఆనంద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామికి అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి అనంతరం శ్రీరుక్మిణి పాండురంగస్వామి వార్ల నిజపాద దర్శనం ఏర్పాటు చేశామని వెల్లడించారు. భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. అలాగే వచ్చేనెల రానున్న కార్తీక ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. భక్తులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం: తపోవనం సర్కిల్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం పోలీసులు దాడి చేశారు. మట్కా బీటర్లు షేక్ మహమ్మద్ ఖాసీం (ఏ.నారాయణపురం గ్రామం), పి.జగదీష్ (శ్రీనివాస పురం, అనంతపురం టౌన్), మంగలి రామ్మూర్తిని (శ్రీనివాస నగర్, అనంతపురం టౌన్) అరెస్ట్ చేసినట్లు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ కే.సాయినాథ్ తెలిపారు. వారి నుంచి మట్కా చీటీలు, పెన్నులు, రూ.2,50,200 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దాడుల్లో ఎస్ఐ వి.రాంప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కే.సాయినాథ్

అనంతపురం: పాత పంథా వీడి సత్ప్రవర్తనతో మెలగాలని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ కే.సాయినాథ్ అన్నారు. ఆదివారం ఇద్దరు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కేసుల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. రౌడీషీటర్లపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని తెలిపారు. నేరం చేస్తే వెంటనే పసిగడతామని పేర్కొన్నారు.

న్యూసెన్స్ కేసు నమోదు..

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ, వేగంగా బైక్‌లు నడుపుతూ పబ్లిక్‌ను ఇబ్బంది పెడుతున్న 5 మంది వ్యక్తులపై న్యూసెన్స్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మరొకరిని ఇబ్బంది కలిగించేలా ర్యాష్ డ్రైవింగ్ చేసినా, బైక్‌కు సైలెన్సర్ తీసేసి నడిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేశారు. దాబాల్లో మద్యం విక్రయాలపై దాడులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి మూల విరాట్‌ను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి, ఆలయం చుట్టూ ఊరేగించారు.

పేదింటి పిల్లలు.. క్రీడల్లో మెరికలు

- ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో నియోజకవర్గ విద్యార్థుల సత్తా
- జాతీయస్థాయి జూడో పోటీలకు ఇద్దరి ఎంపిక
- వివిధ క్రీడల్లో రాష్ట్రస్థాయికి మరో 45 మంది..
- రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహించనున్న క్రీడాకారులు



ఆత్మకూరు మండలం సనపలో హాకీ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆత్మకూరు/కనగానపల్లి/రాప్తాడు/చెన్నేకొత్తపల్లి/రామగిరి: వారందరూ పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులే.. తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేసుకుంటూ పిల్లల్ని కష్టపడి చదివిస్తున్నారు. ఆ విద్యార్థులు కూడా తమ తల్లిదండ్రుల కష్టాన్ని చూసి ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. జాతీయ స్థాయి, రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికై ప్రతిభకు పేదరికం అడ్డు కాదని నిరూపించారు. పట్టుదలతో శ్రమిస్తే ఏదైనా సాధించవచ్చని చెబుతున్నారు. ఇటీవల రాప్తాడు నియోజవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించారు. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్–14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా మండల, జిల్లాస్థాయి అనంతరం ఉమ్మడి జిల్లా జట్లను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. ఈ క్రీడల్లో అండర్–14, అండర్–17, అండర్–19 విభాగంలో నియోజకవర్గ క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. జాతీయస్థాయి పోటీలకు ఇద్దరు.. వివిధ క్రీడాంశాల్లో దాదాపు 45 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారు.

బాలికల హవా..

చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకుంటే చాలు అనుకుంటారు. కానీ రాప్తాడు నియోజకవర్గంలో తల్లిదండ్రులు తమ పిల్లల్ని క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం నిర్వహించిన పరుగు పందెం, హాకీ, ఖోఖో, త్రోబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్‌లో బాలురతో సమానంగా బాలికలు సత్తా చాటారు. క్రీడల్లో తామేమి తక్కువ కాదంటూ రాష్ట్రస్థాయికి ఎంపికై, ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తోడుగా ఉండి ముందుకెళ్లేలా ప్రోత్సహిస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు వీరే..

స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో మండల, జిల్లా, జోనల్ రాష్ట్ర జాతీయ స్థాయిలో అండర్–14, 17, 19 ఏళ్ల వయస్సుల వారీగా, బాల బాలికలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని ఆత్మకూరు, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాల నుంచి విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆత్మకూరు మండలం సనప ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ప్రాతినిథ్యం వహించనున్నారు. అండర్–19 విభాగంలో నందు కిషోర్, ప్రతాప్, పవన్, బాలికల విభాగంలో నవనీత, శైలజ, రజిత, జ్యోష్ణ, భారతి, సమంత, మానుష, అండర్–14 విభాగం బాలురలో సికిందర్, బాలికల విభాగంలో సాయి కీర్తన. భారతి, యామిని, అండర్–17 విభాగంలో హర్ష, సంధ్య, షర్మిల ఎంపికయ్యారు. అలాగే తలుపూరుకు చెందిన నాగ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. ఆత్మకూరులో ఫుట్‌బాల్ అండర్–17లో యశ్వంత్ కుమార్, అథ్లెటిక్స్ అండర్–17 విభాగం షాట్‌పుట్‌లో సరస్వతి, అండర్–14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విష్ణుప్రణవి ఎంపికైంది. ఆత్మకూరు కేజీబీవీకి చెందిన హారిక కబడ్డీలో, స్కిప్పింగ్‌లో సుస్మిత, లాంగ్‌జంప్‌లో ఐశ్వర్య, హైజంప్‌లో సంధ్య, ట్రిపుల్ జంప్‌లో సంధ్య, హైజంప్‌లో లావణ్య, హైజంప్‌లో సంధ్య ఎంపికై ంది. ముట్టాలలో ట్రిపుల్ జంప్‌లో ప్రతాప్‌రెడ్డి, డిస్క్ త్రోలో వెన్నెల, 3 కి.మీ నడకలో వర్షిత రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. రాప్తాడు మండలంలో త్రోబాల్ అండర్–19 విభాగంలో నవ్యశ్రీ, కీర్తన, భవిత, హేమలత, దుర్గ, రేవంత్ రాష్ట్రస్థాయి ఎంపియ్యారు. ఖోఖో అండర్–19లో తనూజ, అండర్–17 విభాగంలో హ్యాండ్‌బాల్‌కు లోకరాజ్, అండర్–14 విభాగంలో హ్యాండ్‌బాల్‌లో చాణక్య సత్తా చాటారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ అండర్–17 విభాగంలో కనగానపల్లి మోడల్ స్కూల్ విద్యార్థి నాగ యశ్వంత్ 5వ స్థానంలో నిలిచాడు. త్వరలో రాయచోటిలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన ప్రవల్లిక, మానస, హారిక పాల్గొంటారు. ఇటీవల ఏలూరులో జరిగన సాఫ్ట్‌బాల్‌లో పోటీల్లో తనూజ పాల్గొంది.

జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపిక..

ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో రామగిరి మండలం నసనకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్–17 విభాగం 90 కేజీల విభాగంలో ముద్దుకృష్ణ ఉత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకం సాధించారు. 73 కేజీల పోటీల్లో విజయరాజు రాణించి వెండి పతకం దక్కించుకున్నాడు. వీరు నవంబర్ నెలలో జమ్మూలో జరిగే జాతీయస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారు. ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో అండర్–17 విభాగంలో చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన మౌనిక బంగారు పథకం సాధించింది. త్వరలో త్రిపురలో జరగబోయే పోటీల్లో మౌనిక ఏపీ నుంచి ప్రాతినిథ్యం వహించనుంది.

జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం



ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో (90 కిలోల విభాగం) బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యాను. చాలా సంతోషంగా ఉంది. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధం అవుతున్నాను. జూడోలో మెలకువలు నేర్చుకుంటున్నాను. చదువుతో పాటు క్రీడల్లోనూ పాల్గొనేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు. – ముద్దు కృష్ణ, రామగిరి

ఏపీకి మంచి పేరు తీసుకొస్తా..



ఇటీవల శ్రీకాళహస్తిలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో అండర్–17 విభాగంలో బంగారు పథకం సాధించా. త్వరలో త్రిపురలో జరగబోయే పోటీల్లో ఏపీ నుంచి పాల్గొంటున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. మా తల్లిదండ్రుల కష్టాన్ని చూసి ఉన్నత స్థాయికి ఎదగాలని నిర్ణయించుకున్నా.. క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఏపీకి మంచి పేరు తీసుకువస్తా. – మౌనిక, చెన్నేకొత్తపల్లి

క్రీడలూ ముఖ్యమే



చదువుతో పాటు విద్యార్థులకు క్రీడలూ ముఖ్యమే. క్రీడల్లో పాల్గొనేందుకు విద్యార్థులకు అవకాశం ఇవ్వాలి. ఎవరిలో ఏ ప్రతిభ ఉందో చెప్పలేము. ప్రస్తుతం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో చాలా మంది ప్రతిభ చాటుకున్నారు. ఆత్మకూరు మండలం నుంచి వివిధ క్రీడాంశాల్లో 18 విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో చాలా మంది ఇప్పటికే రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిని ముందుకు తీసుకెళ్తున్నాం. – నాగరాజు, పీడీ, సనప

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ నాగరాజు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం కమిషనర్ తనకు కేటాయించిన వాహనాన్ని పక్కన పెట్టి.. స్కూటీపై నగరంలో పర్యటించారు. పాతూరు, ప్రభాకర్ స్ట్రీట్, గుత్తి రోడ్డు, ఎన్‌టీఆర్ మార్గ్, జీసస్ నగర్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఏమైనా సమస్యలున్నాయా అంటూ నగర ప్రజలను ఆయన ఆరా తీశారు. గతంలో కొందరు కమిషనర్లు వాహనంలోనే కూర్చుని.. వివిధ ప్రాంతాల్లో పర్యటించే వారు. కమిషనర్ నాగరాజు బైక్‌పై వెళ్లడం ద్వారా క్షేత్రస్థాయిలో సమస్యలను మరింత లోతుగా తెలుసుకోవచ్చని ముందుకెళ్లారు. ప్రభాకర్ స్ట్రీట్‌లో కాలువ బ్లాక్ కావడంతో పూడిక తీత పనులు చేపట్టాలని ప్రజారోగ్య సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా గుత్తి రోడ్డు మరువవంకలో పూడికతీత పనులు చేపట్టాలన్నారు. పాతూరు ప్రభాకర్ జీ పాఠశాలలో దెబ్బతిన్న ప్రహరీగోడను పరిశీలించి, అందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లను ఆదేశించారు. రోడ్డుపై చెత్త కన్పించకుండా ఎప్పటికప్పుడు కంపోస్టు యార్డుకు తరలించేలా చూడాలన్నారు. ముఖ్యంగా శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యటించి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా కళాకారుల అభినందన సభ



ఆచార్య సుధాకర బాబును సత్కరిస్తున్న కళాసంఘాల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: గాయకుడిగా జాతీయ నంది అవార్డు అందుకోవడంతో పాటూ ఏపీ రాష్ట్రస్థాయి పర్యావరణ ప్రాధికార కమిటీ సభ్యుడిగా ఎన్నికైన ఆచార్య సుధాకరబాబును అనంతపురం కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో సత్కరించారు. ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగిన ఆత్మీయ అభినందన సభకు అనంత ఘంటసాల ఆరాధన సమితి అధ్యక్ష, గౌరవాధ్యక్షులు పాలసముద్రం నాగరాజు, ఘంటసాల రామయ్య, పాత పాటల ప్రేమికుల సంఘం ప్రతినిధులు ఓబుళదాసు, ఉపాధ్యాయ గాయకులు బాలమురళీకృష్ణ, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, సీనియర్ గాయకులు కేవీ మహీధర్, జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి తదితరులు హాజరయ్యారు. కళారంగంలో ఆచార్య సుధాకరబాబు చేస్తున్న సేవలను కొనియాడారు. విద్యావేత్తగా, సామాజిక సేవా కార్యకర్తగా, కళాకారుడిగా సుధాకరబాబు ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని తెలిపారు. అంతకు ముందు సాగిన సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాసంస్థల ప్రతినిధులు శ్రీదేవి,భరత్ సురేష్‌బాబు, పగడాల లక్ష్మి, రామాంజనేయులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఆవరణ చదును



గ్రంథాలయం ముందు ఉన్న గుంతలోకి మట్టిని తోలించిన దృశ్యం

రాప్తాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి స్థానిక గ్రంథాలయం ముందు వర్షపు నీరు భారీగా నిలిచింది. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు దారి లేక వెనక్కు వెళ్లేవారు. వర్షం వస్తే గ్రంథాలయం ముందు వర్షం నీరు నిలబడేది. ఈ విషయంపై ఈనెల 21వ తేదీన సాక్షి దినపత్రికలో 'గ్రంథాలయంలోకి వెళ్లేదెలా' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. గ్రంథాలయాధికారి వీర నారాయణ రెడ్డి ఈ విషయాన్ని సర్పంచ్ సాకే తిరుపాలు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్.. ఆదివారం ఉదయం ఐదు టిప్పర్ల మట్టిని గ్రంథాలయం ముందు ఉన్న గుంతలోకి తోలించారు. జేసీబీతో గ్రంథాలయ ఆవరణను మట్టితో చదును చేయించారు. గ్రంథాలయం ముందు ఉన్న గుంతలోకి మట్టిని తోలించడంతో పాఠకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అధికారం చేపట్టిన తర్వాత నీట ముంచేశారని మండిపడ్డారు. 2023 ఖరీఫ్, రబీకి సంబంధించి బీమా ప్రకటించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పంటల బీమాను ప్రైవేటు బీమా కంపెనీలకు అప్పగించే విధానానికి స్వస్తి చెప్పి ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. హంద్రీ–నీవా కింద 3.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించకుండా రైతులను నష్టపరచడం దారుణమన్నారు. మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయడంతో పాటు పత్తి పంటనూ పంటల బీమాలో చేర్చి రైతులకు న్యాయం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడుతూ.... అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు... అధికారం చేపట్టిన తర్వాత మాట మార్చారని మండిపడ్డారు. వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ మీటర్ల ఏర్పాటు సరైంది కాదన్నారు. జిల్లాలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి టమాట రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్పయాదవ్ పాల్గొన్నారు.

తప్పతాగి.. రోడ్డుపై పడిపోయి



మద్యం సేవించి రోడ్డుపై పడిపోయిన యువకుడు

నగరంలో మద్యం విచ్చలవిడిగా లభిస్తుండటంతో మందుబాబులు తెగ తాగేస్తున్నారు. ఆదివారం శ్రీకంఠం సర్కిల్ సమీపంలోని గౌరీ థియేటర్ వద్ద ఓ యువకుడు పూటుగా మద్యం సేవించాడు. మత్తు అధికం కావడంతో మందుబాబులు తెగ తాగేస్తున్నారు. మత్తు అధికం కావడంతో మండుటెండలో రోడ్డుపై పడిపోయాడు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు. నగరంలోని కొన్ని హోటళ్లలో మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ అక్కడే తిని పడిపోతున్నారు. ఎస్కేయూ క్యాంపస్ పక్కనే ఓ ధాబాలోనూ పట్టపగలే విపరీతంగా మద్యం సేవిస్తున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదు. వాస్తవానికి బార్ అండ్ రెస్టారెంట్లలోనే మద్యం సేవించాల్సి ఉన్నప్పటికీ.. చిన్న, చిన్న హోటళ్లలోనూ ఇందుకోసం ఏర్పాట్లు చేయడంతో విచ్చలవిడిగా తాగుతున్నారు. కాగా.. నగరంలో 30 మద్యం షాపులు ఉండగా.. ప్రతి 10 వేల మంది జనాభాకు ఒక మద్యం షాపును ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

– అనంతపురం:

ముళ్లపొదలతో నిండిన శ్మశానవాటిక

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఐటీఐ వెనుక భాగంలో, వెంకటాంపల్లికి వెళ్లే దారిలో ఉన్న శ్మశానవాటికలు ముళ్లపొదలతో నిండిపోయాయి. శ్మశానంలోకి వెళ్లేందుకు వీలు లేకుండా ముళ్లకంపలు పెరిగిపోయాయి. దీంతో అంత్యక్రియలు చేసేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా మరణిస్తే ఆ కుటుంబానికి చెందిన వారు ముందుగానే శ్మశానవాటికకు వెళ్లి ముళ్ల చెట్లను తొలగించి శవాన్ని ఖననం చేయాల్సి పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఉపాధిహామీ పథకంలో భాగంగా ముళ్లచెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే శ్మశానవాటికలను సర్వే చేసి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని చెబుతున్నారు. ప్రహరీ లేకపోవడతో శ్మశానవాటికలు ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

మహిళను బలిగొన్న బెట్టింగ్ భూతం

- భర్త అప్పులు చేయడంతో ఆత్మహత్య
- మృతురాలు ఉదిరిపికొండ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్

రాప్తాడు రూరల్: భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే. చిన్న వయస్సు... హాయిగా సాగిపోవాల్సిన వారిని బెట్టింగ్ భూతం వెంటాడింది. భర్త ఆన్‌లైన్ బెట్టింగ్ తదితర వాటికి బానిసై అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. మనస్తాపానికి గురైన భార్య బలవన్మరణానికి పాల్పడింది. అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్‌లో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనపై రూరల్ పీఎస్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్లికార్జున, మానస (27) భార్యాభర్తలు. మల్లికార్జున శెట్టూరులో పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తుండగా.. మానస కూడేరు మండలం ఉదిరిపికొండ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డ మల్లికార్జున విపరీతమైన అప్పులు చేశాడు. భర్త అప్పుల విషయం బయటపడటంతో తీవ్ర మనస్తాపానికి గురైన మానస శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో సోమవారం ఉదయం 10:30 గంటలకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' జరగనుంది. ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, తదితర విభాగాలకు సంబంధించిన సెక్షన్ హెడ్స్ అందుబాటులో ఉంటారు. గత వారం జరిగిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అధిక సంఖ్యలో సెక్షన్ హెడ్స్ గైర్హాజరయ్యారు. నేడు జరిగే కార్యక్రమానికి అధికారులు అందుబాటులో ఉంటారో లేదో వేచి చూడాలి.

అధికారులు అందుబాటులో ఉండాలి

రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు అన్ని శాఖల అధికారుల హాజరు కావాలని తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్జిదారులు కార్యాలయానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు నివేదిస్తామని హెచ్చరించారు.

మైనార్టీలను ఆదుకోవాలి



మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌తో ఆల్ మేవా ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి కృషి చేయాలని ఆల్ మేవా (ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్) అనంత ప్రతినిధులు మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నంద్యాలలో జరిగిన ఆల్ మేవా రాష్ట్ర వార్షిక మహాసభకు అనంత నుంచి పలువురు ప్రతినిధులు హాజరై మంత్రికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాధ్యక్షుడు వై.ఫకృద్దీన్, జిల్లా అధ్యక్షుడు షేక్షావలి, ప్రధాన కార్యదర్శి ఫరూఖ్ మహ్మద్ తదితరులు మాట్లాడుతూ.. ముస్లిం, మైనార్టీల్లో చాలా మంది నిరుపేదలున్నారన్నారు. ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగా మైనార్టీలకు సబ్‌ప్లాన్ కావాలని తెలిపారు. వక్ఫ్ అమెండ్‌మెంట్ యాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని మైనార్టీల సంక్షేమానికి వినియోగించాలన్నారు. ఆల్ మేవా అసోసియేషన్‌కు ప్రస్తుతమున్న రూల్స్‌ను రిలాక్స్ చేస్తూ ప్రత్యేకంగా పరిగణించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు హిదయతుల్లా, జిలాన్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీటీసీ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ (టీటీసీ) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. నగరంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, 3.30 నుంచి 5 గంటల వరకు మూడు విడతలుగా పరీక్షలు జరిగాయి. డీఈఓ ప్రసాద్‌బాబు పరిశీలించారు. 93 మంది అభ్యర్థులకు గాను 87 మంది హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు.